క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

విస్సన్నపేట: స్థానిక మార్కెట్‌యార్డు వద్ద మండలంలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్లు పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ బుధవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొంటారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

గోల్డ్‌కాయిన్ల అందజేత

రెడ్డిగూడెం: కృష్ణామిల్క్ యూనియన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ యూనియన్ బోర్డు డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి అన్నారు. మండలంలోని రంగాపురం పాల కేంద్రంలో పాలు పోస్తున్న వీరారెడ్డి కుమార్తె కల్యాణికి, రాఘవాపురం పాల కేంద్రంలో పాలు పోస్తున్న వెంకటరెడ్డి కుమారుడు రామకృష్ణారెడ్డికి, కుప్పిరెడ్డి రామిరెడ్డి కుమార్తె కుమారిలకు కల్యాణమస్తు పథకం కింద గోల్డ్ కాయిన్‌ను ఉయ్యూరు అంజిరెడ్డి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మైలవరం క్లస్టర్ మేనేజర్ యశ్వంత్ పాల్గొన్నారు.

ఈఓపీఆర్‌డీగా మురళీకృష్ణ

చాట్రాయి: మండల ఈఓపీఆర్‌డీగా పొట్లూరి మురళీ కృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గన్నవరం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఈఓపీఆర్‌డీగా వచ్చారు. ఎంపీడీఓ దుర్గా ప్రసాదుకు తన నియామకపత్రాన్ని అందజేశారు.

నెమలి ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

నెమలి(గంపలగూడెం):గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ నూతన ట్రస్ట్‌బోర్డు నియామకానికి ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామవర ప్రసాద రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఉప కమిషనర్ దేవదాయ శాఖ, రామారావు పేట కాకినాడ అడ్రస్‌కు అందజేయాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ట్రస్ట్ బోర్డు నియామకం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా 11 మంది సభ్యులతో ట్రస్ట్‌బోర్డు నియామకం చేసే అవకాశం ఉన్న దేవాలయానికి గత ఏడాది ఎనిమిది మంది సభ్యులతో కొనసాగించారు. గత పాలకవర్గం పదవీ కాలం ఆగస్టు 22తో ముగిసింది. ఈ నేపథ్యంలో నూతన ట్రస్ట్‌బోర్డు ఏర్పాటుకు అధికారులు తగిన చర్యలను చేపట్టారు.

17న చదరంగం పోటీలు

మైలవరం: లిటిల్ చాంప్స్ చెస్ అకాడమీ, ది విజయవాడ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన మైలవరం మండలంలోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో అండర్-13 బాల బాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పీ రాజారెడ్డి బుధవారం తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. గెలుపొందిన మొదటి రెండు స్థానాల క్రీడాకారులను రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 90303 08811 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయించాలి

ఎమ్మెల్యే రక్షణనిధి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయించాలని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ. 50 లక్షల వ్యయంతో నేషనల్ హెల్త్‌మిషన్ ద్వారా నూతనంగా నిర్మించే బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణ పనులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనులు జరుగుతున్న సమయంలో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ ల్యాబ్ నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే రోగులకు అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి, వ్యాధులు నిర్ధారించి వారికి అవసరమైన వైద్యం అందిస్తారని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకునేందుకు వేలాది రూపాయలు ఖర్చు లేకుండా ఈ ల్యాబ్‌లో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సహకారంతో ఈ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, వైస్ ఎంపీపీ సిద్ధం పద్మ, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు, మాజీ సర్పంచ్ సతీష్, సోలా నరసింహారావు, వైద్యాధికారి స్వాతి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు టి.సురేష్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీతో అవ్వాతాతల కళ్లల్లో ఆనందం



మైలవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మంజుభార్గవి, వైస్ ఎంపీపీ రహీం



మునగపాడులో నూతన పింఛన్లను అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ



ఊటుకూరులో పింఛన్ల పంపిణీ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పింఛన్లు అందుకున్న అవ్వాతాతల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోందని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. గుంటుపల్లిలో నూతన పింఛన్లను ఆమె బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని గ్రామాల్లో 249 మందికి నూతన పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. సర్పంచ్ భుక్యా కవిత, ఉపసర్పంచ్ మేరి, పంచాయతీ కార్యదర్శి జి.మునేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటేష్ పాల్గొన్నారు. కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో మంజూరైన 307 నూతన పింఛన్లు సచివాలయ కోఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు ఎస్.శివశంకరరావు, ఎన్.బోసు, పీఏసీఎస్ చైర్మన్ ఎం.శివారెడ్డి, కౌన్సిలర్ ఎస్.లక్ష్మీ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

మైలవరంలో..

మొర్సుమల్లి(మైలవరం): మైలవరంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, వైస్ ఎంపీపీ షేక్ రహీం, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మొర్సుమల్లి గ్రామంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సహకారంతో మంజూరైన 32 నూతన పింఛన్లను బుధవారం సర్పంచ్ రమాదేవి లబ్ధిదారులకు అందజేశారు. చంద్రగూడెంలో సర్పంచ్ బొలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 46మందికి కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేశారు. పొందుగల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు కోటమ్మ, మాజీ సర్పంచ్ దొంకెన చలపతిరావు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామానికి మంజూరైన 32 నూతన పింఛన్లను జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. రెడ్డిగూడెం పంచాయతీ కార్యాలయంలో కొత్తగా మంజూరైన 35 పింఛన్లను సర్పంచ్ మల్లాది రాణీ పంపిణీ చేశారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలో ఇటీవల కొత్తగా మంజూరైన పెన్షన్లను ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చనుబండలో వైఎస్సార్ సీపీ నాయకులు వంకిణి వెంకటేశ్వరావు, దిరిశాల సత్యనారాయణ, వనమా వాసు, చిత్తపూరులో సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ఊటుకూరు(గంపలగూడెం):వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజకీయాలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు, ఊటుకూరు ప్రాథమికవ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఊటుకూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పరిధిలో నూతనంగా మంజూరైన 72 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ బొల్లెపోగు రేణుక, ఉప సర్పంచ్ సంగీతం రాఘవయ్య పాల్గొన్నారు.

545 పింఛన్ల మంజూరు

జి.కొండూరు: మండలంలో నూతనంగా 545 పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ తెలిపారు. మండల పరిధి గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, జి.కొండూరు గ్రామాలలో లబ్ధిదారులకు నూతన పింఛన్లను ఎంపీపీ చేతులమీదుగా బుధవారం అందజేశారు.

మునునూరులో..

మునునూరు: మండల వ్యాప్తంగా మంజూరైన నూతన పింఛన్ల పంపిణీని విజయవంతంగా పూర్తి చేసినట్లు జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల వద్ద ఎంపీపీ రావర్ల కృష్ణకుమారి ఆధ్వర్యంలో బుధవారం 285 మంది నూతన పింఛన్‌దారులకు పింఛన్ నగదును, ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కె.తాడేపల్లిలో..

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): అర్హులందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లు అందచేస్తోందని కొత్తూరు తాడేపల్లి సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 25 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమం బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగింది.



మద్దులపర్వలో పింఛన్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి



గుంటుపల్లిలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పాలడుగు జోత్స్న



చనుబండలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీఎం జగన్‌పై అభిమానాన్ని చాటుతున్న ప్రజలు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్



నాగులూరులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం నాగులూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం నుంచి కలిగిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కారానికి అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. సీఎం జగనన్న నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల వల్ల లబ్ధిపొందిన వారు, సామాన్య ప్రజలు అడుగడుగునా అభిమానాన్ని చాటుతూ ముందుకు సాగారు. తొలుత ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్‌కు గ్రామంలో మహిళలు హారతులతో స్వాగతం పలికారు.

నూతన పింఛన్ల పంపిణీ

నాగులూరు గ్రామంలో నూతనంగా 46 పింఛన్లను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా అవినీతికి తావులేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్క అవ్వాతాతలకు వలంటీర్ ద్వారా నేరుగా ఇంటి వద్దకే వెళ్లి పారదర్శకంగా పింఛన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన పింఛన్లు రానివారు వలంటీర్ నేరుగా సచివాలయం కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేస్తే పైసా అవినీతి లేకుండా సేవలందిస్తారన్నారు. పింఛన్లు పొందిన అవ్వాతాతలు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటకృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బలగాని తిరుపతిరావు, సర్పంచ్ మాదుగుణ నాగబాబు, రెడ్డిగూడెం మండలం వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ బత్తుల వెంకటేశ్వరరెడ్డి, రెడ్డిగూడెం, శ్రీరామపురం, రుద్రవరం సొసైటీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరెడ్డి, నాదెళ్ల చెన్నాకేశవరావు, కొనసాని శ్రీనివాసరావు, ఓబులాపురం సర్పంచ్ నూనె అప్పిరెడ్డి, కలకొండ రామారావు, రామినేని వీరస్వామినాయుడు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపీపీ అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15న వలంటీర్లు తమ పరిధిలోని 50 గృహాల్లోని ప్రజల ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారన్నారు. 16 నుంచి ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వ్యాధుల వివరాలను యాప్‌లో అప్‌లోడు చేస్తారని, ఈ నెల 30 నుంచి ప్రతి గ్రామంలో క్యాంప్‌లు నిర్వహించి అనారోగ్యంతో బాధపడేవారికి చికిత్సను అందిస్తారన్నారు. ఒక్కరూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలన్నారు.

ఈ నెల 30వ తేదీ నుంచి గ్రామ, మండల స్థాయిలో నిర్వహించే మెడికల్ క్యాంప్‌లు నిర్వహణకు సంబంధించి మండల స్థాయి అధికారులు బాధ్యతలు తీసుకుని విజయవంతం చేయాలన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించే మూడు రోజులు ముందుగా వలంటీర్లు, ప్రజాప్రతినిధులు మరొకసారి ఇంటింటికీ వెళ్లి మెడికల్ క్యాంప్‌లు ఎక్కడ నిర్వహించనున్నారో తెలపాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్వై నూరాణి, దిగవల్లి, గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డెప్యూటీ సీఎంను కలిసి గ్రేడ్-5 కార్యదర్శులు



డెప్యూటీ సీఎం ముత్యాలనాయుడును కలిసిన జానీపాషా, సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును గ్రామ, వార్డు సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శులు ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ సచివాలయ ఫెడరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా కార్యదర్శుల సమస్యలు ఆయనకు విన్నవించారు. జీఓ నంబర్ 149 ప్రకారం గ్రామ పంచాయతీల పరిపాలనా బాధ్యత, డీడీఓ అధికారాలు కల్పించాలని కోరారు. అధికారాల కోసం ప్రారంభించిన ఫైల్ ప్రస్తుతం మంత్రి వద్ద ఉందన్నారు. ఫైలు ఆమోదించడం ద్వారా ఏడువేల మంది కార్యదర్శులు పూర్తి స్థాయి అధికారాలు పొంది గ్రామస్వరాజ్యం వెల్లివిరిసేలా పరిపాలన చేసే అవకాశం ఉంటుందన్నారు.

వర్షపునీరు తొలగింపునకు చర్యలు

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు వర్షపు నీరు తొలగింపు చర్యలను మున్సిపల్ అధికారులు బుధవారం చేపట్టారు. ఆ ప్రాంతం ప్రజలు వర్షపునీరు నిల్వలపై పడుతున్న ఇబ్బందులు రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే వసంత దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే నీరు తొలగించాలని ఆదేశించడంతో తొలగింపు పనులను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు లంకే అంకమోహనరావు, దయాకర్, పండు, రాధ, రవి పాల్గొన్నారు

సంక్షిప్త వార్తలు

■ 380 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

తిరువూరు: తిరువూరు నుంచి అక్రమంగా తరలివెళుతున్న 380 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల విభాగం అధికారులు బుధవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలుతున్నట్లు జాయింట్ కలెక్టరు కార్యాలయానికి అందిన సమాచారం మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు నేతృత్వంలో అధికారులు తిరువూరు సమీపంలో వాహనాలు తనిఖీ చేశారు. ఒక లారీ, రెండు బొలెరో వాహనాల్లో రేషన్ బియ్యం బస్తాలను గుర్తించారు. వాహనాలను బియ్యం లోడుతో సహా స్వాధీనం చేసుకున్న అధికారులు వెంకయ్య నాయుడు, ప్రణవ్, శివ, చక్కా శివ అనే వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఓ ధనుంజయ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

■ క్రీడాకారుల ఎంపిక పోటీలు

జి.కొండూరు: స్థానిక శాగం శివరామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలలో అండర్-14,17 విభాగాలలో బాల, బాలికలకు తొమ్మిది క్రీడలలో పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో ప్రతిభ చాటిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో పోటీపడతారని హెచ్ఎం శ్రీలత తెలిపారు.

■ కార్మికుల సంక్షేమానికి కృషి

తిరువూరు: ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి తమ యూనియన్ ఎల్లప్పుడూ కృషిచేస్తుందని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రీజియన్ కమిటీ సభ్యుడురవిచంద్ర అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్ డిపో ఎదుట బుధవారం జరిగిన యూనియన్ గేట్ మీటింగులో ఆయన మాట్లాడుతూ ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌గా రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునిస్తూ జీఓ జారీచేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు స్వామి, ఆర్ ఎస్ రావు, రామారావు, స్టాలిన్‌బాబు, కిరణ్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

■ వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు

తిరువూరు: వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ మిత్తింటి శారద బుధవారం తిరువూరులో జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సర్వోదయ ప్రాథమికోన్నత పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తరగతి గదుల్లో నాలుగు సీలింగ్ ఫ్యాన్లను వితరణ ఇచ్చారు. తిరువూరు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో అమ్మకు వందనం కార్యక్రమంలో భాగంగా చిన్నపిల్లలకు తల్లులు పాలిచ్చే విభాగాన్ని ప్రారంభించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు వాసవీ క్లబ్ తరఫున పెన్షన్లను, దుప్పట్లు, బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. జిల్లా క్యాబినెట్ సెక్రటరీ అనంతుల ఇందిర, దుద్దు నాగేశ్వరరావు, జేవీ రమణయ్య, నాళ్లా రామారావు, కూన పవన్‌కుమార్, నాళ్లా ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

■ చిరుధాన్యాలతో ఆరోగ్యం మెండు

గంపలగూడెం: చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యం మెండుగా ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. గంపలగూడెం 62వ అంగన్‌వాడీ సెంటర్లో పట్టణ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పోష్టికాహారం మాసోత్సవాల్లో తొమ్మిది రకాల చిరుధాన్యాలను ప్రదర్శించారు. పిల్లలు, కిశోర బాలికలు చిరుధాన్యాలను వినియోగించడం వల్ల ఒనగూరే ప్రయోజనాలను అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు.

■ ముగిసిన ఆటల పోటీలు

గంపలగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలు బుధవారం ముగిశాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీల్లో రెండవ రోజు అండర్-17 విభాగంలో పోటీలు నిర్వహించారు. ఏడురోజుల పాటు నిర్వహించిన పోటీల్లో అండర్-17, అండర్-14 విభాగాల్లో మండల స్థాయిలో తొమ్మిది రకాల క్రీడలకు సంబంధించిన టీములను ఎంపిక చేశారు. వీరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంది.

■ ఆటల పోటీలకు గొల్లపల్లి విద్యార్థుల ఎంపిక

నూజివీడు: గొల్లపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పొట్లూరి రాధికారాణి బుధవారం తెలిపారు. కబడ్డీ జూనియర్ బాలుర విభాగంలో కిరణ్, రాఘవ, రాజేష్, సీనియర్ కబడ్డీలో విజయకుమార్, నిఖిల్, జూనియర్ ఖోఖో విభాగంలో కిరణ్, సీనియర్ ఖోఖో విభాగంలో భవానీ ప్రసాద్, ఉగ్ర, జూనియర్ షటిల్ విభాగంలో జగదీష్, జూనియర్ కబడ్డీ బాలికల విభాగంలో మేఘన, శ్రీజ, దేవిశ్రీ, ఉమామహేశ్వరి, సీనియర్ కబడ్డీలో ఇందు, జూనియర్ ఖోఖోలో ధనుశ్రీ, సమీర, సీనియర్ ఖోఖోలో జోత్స్న, వాసవి, జూనియర్ టెన్నికాయిట్‌లో శరణ్య ఎంపికైనట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో మునునూరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించే పోటీల్లో వీరందరూ పాల్గొంటారని తెలిపారు.

■ ఎస్‌జీఎఫ్ గేమ్స్ ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలు కొండపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. పాఠశాల హెచ్ఎం ఎంవీ. శేషగిరిరావు క్రీడలు ప్రారంభించారు. ఉల్లాస భరితంగా సాగిన పోటీల్లో నియోజకవర్గ స్థాయి క్రీడాకారులను ఎంపిక చేస్తామని హెచ్ఎం శేషగిరిరావు తెలిపారు.

■ బిల్లుల చెల్లింపుల్లో తొందరపాటు వద్దు

మునునూరు: ప్రభుత్వ పథకాన్ని సవ్యంగా అమలు చేయకుండా, ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తే సహించబోనని ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అరసవల్లి రాము ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 16 గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలపై ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బీఏ సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీలలో పలు గ్రామాల క్షేత్ర సహాయకులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో నాణ్యతాలోపం, బిల్లుల చెల్లింపులలో ఆత్రుత తదితర అంశాలు వెల్లడయ్యాయి. మొత్తం రూ.1,46,548 రికవరీలకు జిల్లా విజిలెన్స్ అధికారి ఏపీవీ విజయలక్ష్మి ఆదేశించారు.జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, సొసైటీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.